

పటాన్‌చెరు : ఓటు వేసి సిరా గుర్తును చూపిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



పటాన్‌చెరు : చిట్కుల్‌లో ఓటు కోసం క్యూలో ఉన్న ఓటర్లు

# పటాన్‌చెరులో ఉత్సాహం చూపిన ఓటర్లు

- లైన్లలో బారులు తీరి ఓట్లు వేసిన ఓటర్లు
- భారీగా తరలివచ్చిన మహిళలు
- పటాన్‌చెరులో ఓటు హక్కును వినియోగించుకున్న ఎమ్మెల్యే గూడెం
- చిట్కుల్‌లో ప్రచారం చేస్తున్నారని ఆందోళన
- బూత్‌లలో వెళ్తున్నారని కాట సుధారాణిని అడ్డుకున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

పటాన్‌చెరు బృందం, నవంబర్ 30 : పటాన్‌చెరులో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. నియోజకవర్గంలోని పటాన్‌చెరు, గుమ్మడిదల, జిన్నారం,అమీన్‌పూర్, రామచంద్రాపురం మండలాల్లో ఎన్నికలు సజావుగా జరిగాయి. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఆయన సతీమణి గూడెం యాదమ్మలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టుకుమార్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ శంకర్‌యాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు సపనదేవ్, మాజీ ఎమ్మెల్యే కే సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు గడీల శ్రీకాంత్‌గౌడ్ ఓటు హక్కును ఉపయోగించుకుని ఓటు వేశారు. మండలంలోని చిట్కుల్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ బూత్ వద్ద నిలబడ్డ ప్రజలను ఎనుగు గుర్తుకు ఓటేయాలని గ్రామ కార్యదర్శి, బిల్ కలెక్టర్ చెబుతున్నారని ఆరోపణలు వచ్చాయి. దీంతో పోలింగ్ కేంద్రం ముందుకు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పోలింగ్ బూత్‌లోకి చొచ్చుకుని వచ్చేందుకు ప్రయత్నించారు. పోలీసులు తక్షణం అప్రమత్తమై వారిని నిలువరించారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ శ్రేణులు గేటు ముందు ఆందోళన చేశారు. సమాచారం అందుకున్న సీఐ లాలునాయక్ హుటాహుటిన పోలింగ్ బూత్‌కు వచ్చి



ఆర్సీపురంలో ఓటు వేసి స్ట్రెచ్చర్‌పై వస్తున్న వృద్ధురాలు

ఆందోళనకు దిగిన వారిని అక్కడినుంచి బలవంతంగా పంపించారు. పటాన్‌చెరు ఆర్వో ఎన్నికల విధుల నుంచి కార్యదర్శి కవితను పక్కకు జరిపారు. ఇస్నాపూర్ గ్రామంలోని స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను సందర్శించేందుకు వచ్చిన కాంగ్రెస్ అభ్యర్థి సతీమణి కాట సుధారాణి పోలింగ్ బూత్‌లలోకి వెళ్లేందుకు ప్రయత్నించడం చూసిన బీఆర్‌ఎస్ వర్గాలు ఆమెను అడ్డుకున్నారు. దీంతో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ వర్గాల మధ్య వాగిగ్వాదం జరిగింది. పోలిసులు స్పందించి కాట సుధారాణిని అక్కడినుంచి పంపించివేశారు.

బొల్లారంలోని ఒక బూత్‌లో బీఆర్‌ఎస్, బీఎస్పీ శ్రేణుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఘర్షణ వాతావరణం ఏర్పడుతుండగా పోలీసులు రంగప్రవేశం చేసి అందరిని అక్కడినుంచి పంపించేశారు. సమస్యాత్మక గ్రామాల్లో అదనపు పోలీసులను మోహరించారు. అన్ని గ్రామాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. పట్టణాల్లోనూ పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా పోలీసులు చర్యలు తీసుకున్నారు. సాయంత్రం 5 తరువాతను లైన్లలో నిల్చున్నవారికి పోలింగ్‌కు అవకాశం ఇచ్చారు. దీంతో సాయంత్రం 7గంటల వరకు కూడా కొన్ని పోలింగ్ కేందాల్లో పోలింగ్ జరిగింది. పోలింగ్ ముగియడంతో పోలింగ్ కేంద్రాల్లో సీజ్ చేసిన ఈవీఎం మెషిన్లను రుద్రారంలోని గీతం యూనివర్సిటీ స్ట్రాంగ్ రూంలకు తరలిస్తున్నారు.

**పోలింగ్ కేంద్రాలను సందర్శించిన అభ్యర్థులు..**

బొల్లారం మున్సిపాలిటీలోని పలు పోలింగ్ కేంద్రాలను ఎమ్మెల్యే స్థానానికి పోటీ చేసే అభ్యర్థులు గూడెం మహిపాల్‌రెడ్డి (బీఆర్‌ఎస్), నందీశ్వర్‌గౌడ్ (బీజేపీ), నీలం మధు ముదిరాజ్ (బీఎస్పీ), కాంగ్రెస్ అభ్యర్థి కాట శ్రీనివాస్‌గౌడ్ సతీమణి కాట సుధారాణి పరిశీలించారు. పోలింగ్ జరుగుతున్న తీరుపై సంతోషం వ్యక్తం చేశారు.

**ఓటేసిన ట్రాన్స్ జెండర్లు...**

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును పౌరులు విధిగా సద్వినియోగం చేసుకున్నారు. ఈ కోవలో బొల్లారం మున్సిపాలిటీలోని వైఎస్సార్ కాలనీకి చెందిన 15మంది ట్రాన్స్ జెండర్లు తమ విలువైన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటు హక్కు బాధ్యత అని ప్రతి ఒక్కరు ఓటు హక్కును కర్తవ్యంగా భావించి వేయాలని పిలుపునిచ్చారు.

**పరిశ్రమలు బంద్..**

ఐడిఏ బొల్లారం పారిశ్రామిక వాడలో గురువారం అసెంబ్లి ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల పరిశ్రమల యాజమాన్యాలు సెలవు ప్రకటించాయి. దీంతో పారిశ్రామిక వాడలోని పరిశ్రమలు, రోడ్లు కార్మికులు లేక నిర్మానుష్యంగా కనిపించాయి. ఓటింగ్ శాతాన్ని పెంచేలా అధికారులు చేపట్టిన అవగాహన కార్యక్రమాలు సత్ఫలితాలను ఇచ్చాయి.



గుమ్మడిదల : బొంతపల్లిలో బారులు దీరిన ఓటర్లు



జిన్నారం : ఊట్లలో ఓట్లు వేసేందుకు వరుసలో వేచి ఉన్న మహిళలు



గుమ్మడిదల : సిరాగుర్తును చూపిస్తున్న జడ్పీటీసీ కుమార్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు



జిన్నారం : బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి చిరునవ్వు

## ఆర్సీపురంలో 69.72శాతం పోలింగ్

రామచంద్రాపురం, నవంబర్ 30 : ఆర్సీపురం, భారతీనగర్ డివిజన్‌లతో పాటు తెల్లాపూర్ మున్సిపాలిటీలో పోలింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగింది. ఓటర్లు క్యూలైన్‌లలో నిలబడి తమ ఓటు హక్కుని వినియోగించుకున్నారు. ఆర్సీపురం, భారతీనగర్, తెల్లాపూర్ మున్సిపాలిటీలో మొత్తం 106 పోలింగ్ బూత్‌లను అధికారులు ఏర్పాటు చేశారు. వృద్ధులు, వికలాంగులు, ఇతరత్ర సమస్యలు ఉన్నవారిని ఆటోలో తీసుకువచ్చి సిబ్బంది ఓటు వేయించారు. ఆర్సీపురం పరిధిలో ఉదయం 11గంటలకు 16.17శాతం పోలింగ్ జరిగింది. సాయత్రం 5గంటల వరకు 69.72శాతం పోలింగ్ నమోదు అయింది. 5గంటల తర్వాత కూడా పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు ఓటు వేసేందుకు బారులు తీరారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



భారతీనగర్‌లోని ఎల్‌ఐజీలో విద్యాభారతీ స్కూల్‌లో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు




అమీన్‌పూర్ : ఓటు హక్కును వినియోగించుకున్న మున్సిపల్ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్



బొల్లారం : కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



జిన్నారం : శివనగర్‌లో ఓట్లు వేసేందుకు క్యూలో ఉన్న మహిళలు

## ఎన్నికల విధుల్లో ఉద్యోగి మృతి

పటాన్‌చెరు, నవంబర్ 30 : ఎన్నికల విధుల్లో ఉద్యోగి మృతి చెందిన సంఘటన ఇస్నాపూర్‌లో చోటు చేసుకుంది. మండలంలోని ఇస్నాపూర్‌లో పోలింగ్ కేంద్రంలో 248బూత్ వద్ద విధుల నిర్వహించెందుకు సుధాకర్(48) బుధవారం రాత్రి వచ్చారు. అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతంలో సుధాకర్‌కు ఛాతి నొప్పి వచ్చింది. ఆయనతో పాటు విధుల్లో ఉన్న ఎన్నికల సిబ్బంది హుటాహుటిన పటాన్‌చెరు ఏరియా దవాఖానకు తరలించారు. అప్పటికే అతను గుండెపోటుతో మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. సుధాకర్ వెటర్నరీ విభాగంలో సహాయకుడిగా పని చేస్తున్నారు. సుధాకర్ మృతదేహాన్ని ఆయన కుటుంబానికి ఎన్నికల అధికారులు అప్పగించారు. సుధాకర్ మరణంపై ఇస్నాపూర్ గ్రామ నాయకులు సంతాపం తెలిపారు.